# వ్యసనం

-దోరవేటి

సప్త వ్యసనాల్లో వేటను ఎందుకు చేర్చారో క్రమేపీ నాకు అనుభవంలోకి వస్తోంది. తాగుడూ, జూదం లాగే దీని శక్తీ బలీయమైనదని అర్థమవుతోంది.

కాకపోతే కాలానుగుణంగా అంతరించిపోతున్న కొన్ని జాతులూ, ఆచారాల్లో ఇది చేరిపోతుండడంలో ఆశ్చర్యంలేదు. ఆహారం కోసం, జీవనం కోసం వేటాడడం వ్యసనం కాదేమోకానీ కాలక్షేపం కోసం, ఆనందం కోసం వేటాడడం మాత్రం వ్యసనమే.

అలాంటి వ్యసనంలో నేనూ చిక్కుకుపోయాను. అదే చేపల వేట. అదీ గాలాలతో. అదో థ్రిల్. మొదట్లో రాముతో 'చూద్దాం ఎలా వుంటుందో? అన్న ఉత్సుకతతో వెళ్లిన నాకు క్రమేపీ అందులో మజా కనిపించసాగింది.

అందుకే ఆదివారం రాగానే రామూ పిలుపు కోసం ఎదురు చూడడం అలవాటయింది. మామూలుగా ఎనిమిదింటికిగానీ నిద్ర లేవని నేను ఆ రోజు ఆరింటికే లేచేస్తాను.

అయ్యప్ప పూజకోసం తయారయ్యే భక్తుడిలా స్నానాదికాలన్నీ పూర్తి చేసుకుని ఇంట్లో వారిని ఆశ్చర్యంలో ముంచేస్తాను. వేడి వేడి టిఫిన్ మాత్రమే ఇష్టపడే నేను ఆ రోజు చద్దన్నమైనా ఇష్టంగా తింటాను.

నా పరిస్థితిని అర్థం చేసుకున్న వదిన వేడి టిఫినే ఏర్పాటు చేస్తుంది సమయానికి.

"రాజూ! ప్రతి ఆదివారం ఎక్కడికెళ్తున్నావయ్యా? కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి కూడా ఇంత శ్రద్ధగా తయారుకాలేదు. కొంపదీసి లవ్ ఎఫైర్ ఏదైనా..." చపాతీ వేస్తూ నావైపు అదోలా చూసింది వదిన.

అవునూ ఇన్నాళ్ళూ నాకీ ఆలోచనే రాలేదేంటి? మా వాళ్లని తప్పుదారి పట్టించడానికి ఇదే రాచబాట.

ఇంత మంచి బాట చూపిన వదినకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుని ఓ చిరునవ్వు పూయించాను పెదాలమీద. అది లక్ష్మణ దేవర నవ్వులా పని చేస్తుందని నాకు తెలుసు.

"ఆ..." అంది వదిన. 'నిజంగా అంత సీనుందా?' అన్నట్లు.

మనం మాత్రం తక్కువా? 'అశ్వర్థామ హతః' అన్న ధర్మరాజు లెవెల్లో మరో చిరునవ్వు విసిరేశాం.

అంతే ఆవిడ మొహం విచిత్రమైన కాంతితో వెలిగిపోసాగింది.

అప్పటికి సంబరపడ్డానుగానీ అది కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని ఊహించలేకపోవడం నా అజ్ఞానమే.

నిజానికి నా వ్యసనానికి ప్రధాన ప్రతిబంధకం మా ఇంటి వాతావరణమే. మేం పక్కా శాకాహారులం. మాంసం కాదుకదా గుడ్డు పేరు కూడా మా ఇంట్లో ఎత్తడానికి వీల్లేదు.

ఉద్యోగం వచ్చాక స్వేచ్ఛ లభిస్తుందన్న ఆశలో వున్న నాకు బట్టతలమీద తాటికాయ పడ్డ చందమైంది నా పరిస్థితి. రంగారెడ్డి జిల్లా నవాబ్‌పేటలో ఉద్యోగం అంటే నాకు బోలెడు స్వేచ్ఛ అనుకుని సంబరపడ్డాను.

కానీ మరీ అంత సంతోషకరమైంది కాదన్న లెవెల్లో దగ్గరలోని అన్నయ్య వాళ్ల కుటుంబానికి నా స్వేచ్ఛను అంకితం చేయాలని సమన్లు జారీ అయ్యాయి నాన్న నుండి. నాన్న అధికారం నుండి అన్నయ్య ఆధిపత్యంలోకి మారిన సామంతుడినయ్యాను.

ఇదీ ఒకందుకు మంచిదే. తినడం తప్ప వండడం, కడగడం లాంటి బాదరాబందీలేదు. కొత్తలో సాయంత్రం కాలేజీ నుండి వచ్చాక కాసేపు గ్రౌండ్‌కి వెళ్లి ఏదో ఆటాడుకునేవాడ్ని. దానికే మా బాచిగాడు (అన్నయ్య కొడుకు ఆరో తరగతి చదివే వివేక్) సైంధవుడయ్యాడు. నేను ఇంటికి వచ్చేటప్పటికి వాడెదురు చూస్తుంటాడు. లెక్కల్లో చిక్కులు విడదీసి ఇంగ్లీషు గ్రామర్ గతికించాలి వాడికి.

చదువుకునే కాలంలోనే ట్యూషన్స్ చెప్పలేదు నేను. ఇప్పుడు మాత్రం తప్పడంలేదు.

"అమ్మాయి బాగుంటుందా? ఏ రంగు?"

తల దువ్వుకుంటూ ఉలిక్కిపడ్డాను.

"అదే... ఇందాక నువ్వే..." వదిన రిఫరెన్స్ ఇచ్చింది.

'ఛ... దీనివెనుక ఇంత రిస్క్ వుందా?' అనిపించింది. ఏదో బ్రహ్మాస్త్రం సంధించాలి అనుకుంటుంటే దొరికింది.

"వదినా! ప్లీజ్. నేను చెప్పేదాకా ఈ సంగతి నన్ను మళ్లీ అడగొద్దు. ఎవ్వరికీ చెప్పొద్దు" చేతులు జోడించి భయం, జంకు, అభిమానం వగైరా భావాలన్నీ మొహంలో ప్రదర్శించాను. కాలేజీ రోజుల్లో నాటకాలేయడం ఇలా ఉపయోగపడింది.

ఏమనుకుందో ఏమనకుండానే కాఫీ కలిపి ఇచ్చింది.

అరగంటయింది. రామూ పత్తాలేడు. కానీ బాగా చీవాట్లు పెట్టాలి. ఇట్లా అయితే నీతో రాను అని బింకం నటించాలి. అతనికే ఈ వ్యసనం మెండు.

అసలతనేగా నాకీ అలవాటు చేసింది. ఇలా నా ఆలోచనలతో నేను కుస్తీపట్లలో ఉండగా మరో అరగంట అయిపోయింది. నాలో టెన్షన్ పెరిగిపోసాగింది.

నేనే వాళ్లిల్లు వెతుక్కుంటూ పోవడం అంత బాగుండదు. అతను మా అటెండరు. ఉండేది ఏదో ఇరుకు వీధిలో.

పైగా వాళ్ల కుటుంబ పరిస్థితులు అంతగా తెలీదు. వాళ్లావిడా...పిల్లలు...

"బాబాయ్! నేనూ వస్తా" పక్కలో బాంబులా బాబిగాడు.

"ఎక్కడికీ?" చిరాకునణచుకుంటూ నేను.

"పిక్‌నిక్ వెళ్తున్నారటగా" అమాయకంగా వాడు.

బహుశా వదిన మాటవరుసకు చెప్పి వుంటుంది.

ఏం చెప్పాలా? అని నాలో నేను మల్లగుల్లాలు పడుతున్నాను.

"బాబీ! మనం ఆంటీ వాళ్లతో కల్సి తరువాత వెళ్దాం. బాబాయ్‌ని వెళ్లనీ" వదిన ఆపద్బాంధవిలా వచ్చి వాడ్ని అవతలికి లాక్కెళ్లింది. అంత

లోనే మళ్లీ ప్రత్యక్షమైంది.

"అవునూ! ప్రతిసారీ ఆ రామూనెందుకయ్యా వెంటబెట్టుకెళ్తావ్?"

ఇలాంటి ప్రశ్న ఒకటి వుంటుందని ఊహించ లేదు. ఠక్కున నా దృష్టి పేపర్‌లోని సినిమా బొమ్మలమీద పడింది. ఓ ఫ్లాష్ వెలిగింది.

"అదీ... అదే వదినా సినిమాల్లో కూడా హీరో వెనుక ఓ సపోర్టింగ్ క్యారెక్టర్ వుంటుందికదా."

వదినకు అర్థం కాలేదని తెలుస్తోంది. లేటెస్ట్ ఎగ్జాంపుల్ పనికిరావు. కాస్త పాతవి కావాలి.

"అదే పాతాళభైరవిలో ఎన్టీవోడి వెంట అంజిగాడు, దసరాబుల్లోడులో ఏఎన్నార్‌ెంబడి పద్మనాభంలా అన్నమాట."


"ఓహో అలాగా... అయితే అతని క్కూడా..."

"వదినా! ప్లీజ్ ఈ విషయంలో ఇంకేమీ అడగకు. నన్ను అబద్ధాల పాల్జేయకు" అంటూ మరో దణ్ణం పెట్టాను.

"సరేలే. జాగ్రత్త" నిరుత్సాహంగానే అక్కడి నుంచి కదిలింది వదిన. వర్షం వెలిసినట్టయింది.

'ఇంకా ఇక్కడే వుంటే ఎన్ని తుపానులు ఎదుర్కోవాలో!' అనుకుంటూ

రామూ ఇల్లు వెదుక్కుంటూ బయలుదేరాను. ఆ బస్తీ భారతదేశ ఆర్థిక పరిస్థితికి బొమ్మ కట్టినట్లుంది. ఆ వీధిలో ఆడవాళ్లు రాత్రంతా తాగుబోతు మొగుళ్లతో పడ్డ అగచాట్లు మరచిపోవడానికా అన్నట్లు గొంతు చించుకుని అరుస్తున్నారు.



## దానం

''బాబూ ధర్మం'' రోడ్డున పోతున్న ఓ వ్యక్తిని ముష్టెత్తాడు బిచ్చగాడు.

''ఏమయ్యా దుక్కలా వున్నావు. ఇలా అడుక్కోకపోతే కష్టపడి ఏదైనా పని చేసుకోకూడదూ?''

''నిజమేననుకోండి. కానీ మేమే కనుక అడుక్కోకపోతే మీరు ఇంత దానం చేసి అంత పుణ్యం ఎలా సంపాదించుకోగలరు?''

## రుచి

''ఏమండీ! నేను ఊళ్లోలేని ఈ నాలుగు రోజులూ రుచీపచీలేని హోటల్ తిండి ఏం తిన్నారో ఏమో? వంట చేస్తానుండండి'' అంది ఊరి నుంచి వచ్చిన భార్య.

''అసలు హోటల్లో తిన్న తరువాతే కదా పదార్థాలెంత రుచికరంగా వుంటాయో తెలిసి వచ్చింది'' గొణుక్కున్నాడు భర్త.

## కొడతాడు

''మా ఆయన రోజూ మందు కొడతాడు'' పక్కింటి పంకజం దగ్గర బాధపడింది కాంతం.

''అదేమంత విషయమని అలా బాధపడిపోతావ్?' తేలిగ్గా అంది పంకజం.

''అదేమిటి అలా అంటావ్?''

''మీ ఆయన మందే కొడ్తాడు. మా ఆయన మందుతోపాటు నన్నూ కొడతాడు.''

—సోనికాఫిలిప్
(సికింద్రాబాద్)

పిల్లలతో పోటీ పడుతూ అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నాయి పందులు మనుష్యుల్ని రాసుకుంటూనే. అక్కడక్కడా తగవులాడుకుంటున్నాయి తమదైన శైలిలో కుక్కలు.

ఆహా... వ్యసనమెంత భయంకరమైనది? ఒక లెక్చరర్నయి ఉండీ ఓ అటెండర్ ఇల్లు వెతుక్కుంటూ ఇలా అడ్డమైన గల్లీల్లో..

ఇంకా ఆ వాతావరణంలో ముందుకు సాగలేక వెనుదిరగడం మంచిదనుకుంటుండగా వాళ్లావిడ నన్ను చూసింది.

మరుక్షణం గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు రాము.

"సార్... రండి సార్ ప్లీజ్..'' ఆహ్వానించాడు భయభక్తులతో.

ఇంట్లో వాతావరణం బయట వాతావరణానికి పెద్ద తేడా ఏమీలేదు. కుక్కి మంచంలో ఓ ముసలమ్మ చావలేక, లేవలేక అదే పనిగా దగ్గుతోంది. మధ్యమధ్యలో కాండ్రించి ఓ రేకు డబ్బాలో ఉమ్మేస్తోంది.

ఓ ఇరవయ్యేళ్ల అబ్బాయి రాము తమ్ముడు కాబోలు క్రికెట్ని సర్వం మరచిపోయి చూస్తున్నాడు.

"అరేయ్! టీవీ బంద్ చేయ్'' వాడ్ని మందలించి నాకో కుర్చీ దులిపి ఇచ్చాడు రాము.

ఆ అబ్బాయి టీవీ ఆఫ్ చేయలేదు. సౌండ్ తగ్గించాడు. రామూ స్వయంగా ఆ పనికి పూనుకోగానే కొరుక్కుతినేలా చూస్తూ అక్కడినుంచి కదిలాడు.

"సారీ రామూ. నే వస్తామరి'' ఆ వాతావరణంలో అట్టేసేపు ఉండడం ఆరోగ్యకరం కాదని లేచాను.

"సార్... ఒక్క నిముషం ఉండండి. చాయ్ తాగి...''

గతుక్కుమన్నాను.

అంటే ఈ రోజు వేట కార్యక్రమం లేనట్టేనా? ఒక్కసారిగా ఏదో నిస్సత్తువ నా అణువణువూ ఆవరించినట్లైంది. అది పసిగట్టినట్టున్నాడు రాము.

"మా అమ్మ ఆరోగ్యం బాగా లేదు సార్. ఈ రోజె వరో డాక్టర్ హైదరాబాద్ నుండి వస్తాడట. అతనొచ్చాక అమ్మను డాక్టర్కి చూపాలి'' నా మొహంలో రంగులు మారడం గమనించి తనే అన్నాడు మళ్లీ "మా తమ్ముడు తోడొస్తాడు. ఈసారికి మీరెళ్లిరండి. అన్నీ రెడీ చేసి వుంచాను.''

ఏంటీ? ఇందాకటి శాల్తీయేనా? వాడసలు మాట వినే రకమేనా?

"సూరీ!'' కేకేసాడు రాము.

బాణంలా దూసుకొచ్చాడు ఓ పదమూడేళ్ల కుర్రాడు.

రంగు నలుపే అయినా చూడగానే ఆకట్టుకునే విగ్రహం వాడిది.

"ఇదిగో ఈ సారే వెళ్తావా?'' ముందే వాడికి అన్నీ చెప్పినట్టున్నాడు రాము.

"గుడ్మార్నింగ్ సార్'' శాల్యూట్ చేసాడు వాడు.

ముచ్చటేసింది నాకు.

ఉదయం నుండీ ఎదురైన పరిస్థితుల్ని చూస్తుంటే అసలు ఈ రోజుకి వేట కార్యక్రమం విరమించుకోవడమే మంచిదనిపించింది. కానీ ఎప్పటి కప్పుడు పరిస్థితులు డోలాయమానంలో పడేస్తున్నాయి.

మొత్తం మీద సూరీ, నేనూ కలసి వేటకోసం ఇక్కడికి పదకొండు కిలోమీటర్ల దూరంలో వున్న సర్వాన్పల్లి చెరువుకి బయల్దేరాం.

మొదట అంతగా ఇష్టం లేకున్నా థియేటర్ని చేరుకోగానే సినిమా చూడాలన్న కాంక్ష పెరిగినట్టు చెరువు కనిపించగానే అంతసేపటి అసంతృప్తీ, సందిగ్ధత మాయమై ఎప్పుడెప్పుడు వేటకు ఉపక్రమిస్తామా అన్న ఉత్సాహం ఉరకలెత్తసాగింది నాలో.

సూరి రాముకంటే ఉత్సాహవంతుడు. ఈ విషయంలో మంచి అనుభవం, వయసుకు మించిన పరిణతీ కనిపిస్తున్నాయి. చకచకా కర్రలు (బెత్తాలు) తెంచి గాలాలు కట్టేసాడు.

"ఊ... ఎరలివ్వు'' గాలం చెరువులో వేసేందుకు సిద్ధపడుతూ అడిగాన్నేను.

"ఆ...'' అంటూ వాడు వెంట తెచ్చిన సంచీలో వెతకసాగాడు. క్షణాల్లో వానిలో కంగారు పెరిగింది.

"ఇందులోనే పెట్టాను సార్. కనిపించడంలేదు'' నిరుత్సాహం నిండిన గొంతుతో అన్నాడు సూరి.

నిరాశతో నీరుగారిపోయాన్నేను.

"సరిగ్గా చూడు'' ఏదో ఆశ.

సంచీలోంచి ఒక్కొక్కటే బయటపెట్టి బుర్ర గోక్కున్నాడు వాడు.

"ఇక్కడెక్కడా వానపాములు దొరకవా?'' ఏదో ఆశాలేశం వాడి మొహంలో.

"ఇక్కడ దొరకవనేకదా అక్కడి నుండి తెచ్చేది'' అసహనాన్ని అణచిపెట్టడం కష్టమైంది నాకు.

అసలు గాలాలతో చేపలు పట్టడంలో ఇదే ప్రముఖ ఘట్టం.

వానపాములు తవ్వడమనే లింకే లేకుండా



హాయిగా ఎవ్వరి తోడు లేకుండావచ్చి పనిగానిచ్చుకుని వెళ్ళేవాడ్ని. ఇప్పుడేంటి గతి? టన్నులకొద్దీ బరువైన ప్రశ్న మెదడులో విలయతాండవం చేస్తోంది.

"ఐడియా" గట్టిగా అరిచాడు సూరి.

ఏమిటన్నట్లు చూసాను అయోమయంతో.

"వానపాములకు బదులు రొయ్యలు పెట్టొచ్చు."

పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమన్నట్టుంది వాని వాలకం.

"చెరువు కాలువలో రొయ్యలు దొరుకుతాయి సార్. ఇదిగో బట్ట కూడా వుంది" ఒక్క క్షణమాగి చెప్పాలా వద్దా అన్నట్లు మళ్లీ "మీరు కూడా నీళ్లల్లోకి దిగాలి."

పది నిముషాల తర్జనభర్జన తరువాత తరుణోపాయం అర్థమై ఆ కాలువ నీళ్లల్లోకి దిగాను సూరితోపాటు. ఆహా వ్యసనమెంత చిత్రమైంది? ఇస్త్రీ బట్టలు నలగకుండా చూపుల్తోనే విద్యార్థుల్ని గడగడలాడిస్తూ తరగతి గదుల్లో లెక్కలు బోధించే నేను... ఇక్కడ ఈ మారుమూల ప్రాంతంలో ఒంటి మీద కేవలం కట్ డ్రాయర్‌తో ఈ కాలువలో మోకాలి వరకు నీళ్లల్లో... నాలో నేనే ఓ పిచ్చి నవ్వు నవ్వుకున్నాను. ఒక్కసారి ఆ గుడ్డని నీళ్లల్లో ముంచి పైకెత్తాం.

ఆశ్చర్యం. గుడ్డలో చిన్నచిన్న చేపపిల్లలు గంతులేస్తున్నాయి. వాటిని చూడగానే నాలోని ఇన్ఫీరియారిటీ సగం తుడిచిపెట్టుకుపోయింది.

"ఇవి కూడా పనికొస్తాయి" సూరి ఆ చేపపిల్లల్ని తన మొలలో దోపుకుని వున్న ప్లాస్టిక్ కవర్‌లో వేసుకున్నాడు.

కాలువ గోడలకు గుడ్డతో ప్రయత్నిస్తే రొయ్యలూ వచ్చాయి. కొద్ది నిముషాల్లోనే అవి పట్టడంలోనూ మజా ఆస్వాదించసాగాను.

అలా ఎంతసేపు గడిచిందో!

"బాబాయ్!"

ఉలిక్కిపడ్డాను.

అది బాబిగాడి గొంతే. కానీ ఈ సమయంలో ఇక్కడ... చేతిలోని గుడ్డ జారిపోగా భయం, అనుమానం కలగలిసిన నా చూపుల్ని శబ్దం వినిపించిన వైపు తిప్పాను. శిలాప్రతిమనైపోయాను.

"బాబాయ్! ఇక్కడున్నావేమిటి? నేను ఆంటీవాళ్లతో పిక్నిక్‌కి వచ్చా. అమ్మ కూడా వచ్చింది."

వాడి నోట్లో మాట నోట్లోనే వుంది. వదిన ప్రత్యక్షమైంది నవ్వుతూ. తల ఎక్కడ దాచుకోవాలో తోచలేదు. సిగ్గుతో, అవమానంతో, అపరాధభావంతో కుంచించుకుపోయాను. నా అవస్థ గమనించిన వదిన బాబిగాడ్ని తీసుకుని అక్కడినుండి కదిలింది ముసిముసిగా నవ్వుతూ.

★★★

రెండోసారి తలుపు తట్టబోయాను.

"బోల్టెయ్యలేదు. నెట్టండి" పొడిగా, ఒకింత కరినంగా వదిన గొంతు బెడ్రూం నుండి.

ఆలస్యంగా ఇంటికొచ్చి రెండో తప్పు చేస్తున్నట్లు నాకిప్పుడు అర్థమవుతోంది. పదకొండున్నర అయింది రాత్రి. ఇంటికి రావడానికి మొహం చెల్లక మరెక్కడికీ వెళ్లే దారిలేక ఇలా రాక తప్పలేదు. నిజానికి రోజూ పదింటికే నిద్రపోతాను. ఆదివారమైతే అలసటవల్ల కాబోలు గంట ముందే నిద్ర పట్టేస్తుంది.

నన్ను వదిన సరిగ్గానే స్వాగతిస్తుంది అనుకుంటూ లోపలికొచ్చి గడియ వేయబోయాను.

"బోల్టేయకండి. మరిదిగారింకా రాలేదు."

'అంటే వచ్చింది అన్నయ్య అనుకుంటోంది. ఇంకా నా ఉనికిని తెల్పకపోవడం మంచిదికాదు' అనుకుంటూ దగ్గాను.

దిగ్గున లేచి హాల్లోకొచ్చింది.

"రాజూ! ఇంత ఆలస్యం చేశావేమయ్యా?" కంగారును అణుచుకుంటూ పరామర్శించింది.

తల వంచుకున్నాన్నేను.

"మధ్యాహ్నం జరిగిందాని గురించి ఫీలవుతున్నావా?" అడిగింది.

"సారీ వదినా!" ప్రయత్నపూర్వకంగా గొంతు పెగల్చుకున్నాను.

"అనుకోకుండా నాకీ వ్యసనం చుట్టుకుంది..." ఎలా అలవాటైందీ మొత్తం కథ కమామీషు సంక్షిప్త శబ్ద చిత్రంలా చెప్పాను వదిన కళ్లల్లోకి చూడకుండానే.

కొద్ది క్షణాల మౌనం తరువాత వదిన-

"రాజూ! నీది వ్యసనం కాదు హాబీ. ఒకవేళ అది వ్యసనమే అనుకున్నా దానివల్ల నీకు ఆనందమేకానీ ఇతరులకే అపకారమూ కలగదు. కానీ మీ అన్నయ్య తాగుడికి బానిసయ్యాడు..." ఆమె కళ్లల్లో కన్నీటి పొర. "ఇప్పుడింకేవో అలవాటు చేసుకుంటున్నాడట... ఏ రోగమో వస్తే?" ఆపై మాట్లాడనీయకుండా దుఃఖం ఆమె గొంతునడ్డుకుంది. మొదటిసారి అన్నయ్య గురించి ఓ చేదు నిజం తెలిసింది.

అదీ వదిన గొంతులో.

'వదిననూ, అన్నయ్యనూ, బాబిగాడ్నీ కూడా కాపాడుకునేందుకు ఏదో ఒకటి చేయాలి' ఆలోచిస్తూ నా బెడ్రూంవైపు నడిచాను.

★



## ఎవరికి తెలుసు?

తారల జీవితం చూస్తుంటే వేదాంతం గుర్తుకొస్తుంది. తారలు ఎవరితో ఎప్పుడు ఎలా స్నేహం చేస్తారో ఎవరికీ తెలీదు. ఎందుకంటే ఇప్పుడు స్నేహంగా ఉన్న తారలు మరి కొద్దిరోజులకే మరో తారతో స్నేహం చేస్తుంటారు. ఇప్పుడు బిపాషా తనకో మంచి ఫ్రెండ్ దొరకిందంటోంది. సునీల్‌శెట్టి రక్త్‌లో ఇద్దరూ కలిసి నటిస్తున్నారు. 'అమృతా నాకో మంచి ఫ్రెండ్. ఆమెతో కలిసి నటించడం భలేగా ఉంటుంది' అంటోంది బిపాషా.

